క్లుప్తంగా

నాడు-నేడు పనులను సకాలంలో పూర్తిచేయాలి



జేవీకే కిట్లను అందచేస్తున్న ఎంఈఓ అన్నమ్మ

దెందులూరు : నాడు–నేడు, మన బడి పథకం ప్రాధాన్యతను ఉపాధ్యాయులు సీరియస్‌గా తీసుకుని మిగిలిన పనులు పూర్తి చేయడానికి తమ వంతు కృషి చేయాలని దెందులూరు మండల విద్యాశాఖాధికారి అన్నమ్మ అన్నారు. సోమవారం మండలంలోని సీతంపేట పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు, మన బడి పనులను పరిశీలించారు. పూర్తిస్థాయి నాణ్యతా ప్రమాణాలతో పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అనంతరం నాలుగు జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందచేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మి సుజాత ఉన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ



వైఎస్సార్‌కు జేజేలు కొడుతున్న ఎంఆర్‌పీఎస్ నేతలు

పెదవేగి : మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఎందరో పేదలకు ఉచితంగా వైద్యం అందుతుందని ఎమ్మార్పీఎస్ నాయకులు తనగల శేఖర్ అన్నారు. సోమవారం పెదవేగి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్యశ్రీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మద్దాల తిరుపతిరావు, ఎర్ర రఘు, దేవరపల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయరహదారిపై పోలీసుల గస్తీ



గుండుగొలను వద్ద బీట్లు తనిఖీ చేస్తున్న ఎస్సై ఐ.వీర్రాజు

దెందులూరు : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని జాతీయ రహదారిపై గుండుగొలను, దెందులూరు, సోమవరప్పాడు బీట్లను ఎస్సై ఐ.వీర్రాజు, సిబ్బంది సోమవారం రాత్రి తనిఖీ చేశారు. గార్డు రికార్డు బుక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్న దెందులూరు మండలంలో జాతీయ రహదారిపై అనునిత్యం గస్తీ నిర్వహిస్తున్నామన్నారు. ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాలు నమోదు కాకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టామని, ఇందులో భాగంగా అర్ధరాత్రి లారీలు ఆపి డ్రైవర్లకు ఫేస్ వాష్, వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు.

చేనేత వస్త్రాలను ధరించాలి



చేనేత వస్త్రధారణ పోటీలో విజేతలకు బహుమతి ప్రదానం

ఉంగుటూరు: చేనేత వస్త్రాలను ధరించడం ద్వారా నేత కార్మికులను ప్రోత్సహించాలని కైకరం హైస్కూలు హెచ్ ఎం శ్రీనివాసరావు అన్నారు. కైకరం హైస్కూల్లో సోమవారం చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చేనేత వస్త్రధారణ పోటీ, వ్యాసరచన పోటీ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గవరయ్య, కన్నారావు, నాగసుద, పోపయమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

నులి నివారణ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు



భీమడోలులో వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి

భీమడోలు: నులిపురుగుల నివారణ ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి అన్నారు. భీమడోలు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్, విద్యాశాఖ అధికారులతో ఆమె నులిపురుగు నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ యాక్షన్ ప్లాన్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 19 ఏళ్ల లోపు బాలబాలికలు, యువతీ యువకులకు ఈనెల 10వ తేదీ, 17వ తేదీల్లో ఆల్బెండజోల్ మాత్రలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఈ.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీవో కె.విజయలక్ష్మి, ఎంపీహెచ్‌వోలు శ్రీనివాసరావు, కిషోర్, సూపర్‌వైజర్ షాహనాజ్ బేగం పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పౌష్టికాహారం



మహిళకు పౌష్టికాహారం అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

- వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ
- గర్భిణులు, బాలింతలకు ఊరట



రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 10 రకాల పౌష్టికాహార పదార్థాలు

దెందులూరు : గర్భిణులు, బాలింతలకు ఇంటికే పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత అరికట్టేందుకు ప్రభుత్వం ఇప్పటివరకు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పోషకాహారం అందించేది. అయితే గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేకపోవడంతో రక్తహీనత సమస్యను ఎదుర్కొంటున్నారు. దీంతో వారు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి ఇకనుంచి వారి ఇళ్లకే పోషకాహారం అందించేలా చర్యలు తీసుకున్నారు. గర్భిణులు, బాలింతల ఇళ్లకే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్నారు. ఒక్కొక్క లబ్ధిదారుడికి కోడి గుడ్లతోపాటు మూడు కేజీల బియ్యం, ఒక కేజీ పప్పు, అరలీటరు ఆయిల్, పావు కేజీ ఖర్జూరం, కేజీ బెల్లం, 5 లీటర్ల పాలు, రెండు కేజీల రాగిపిండి, ఒక కేజీ అటుకులు, పావు కేజీ చిక్కీలు మొత్తం 10 రకాల పోషక పదార్థాలను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. దీంతో దెందులూరు నియోజకవర్గంలో దెందులూరు, పెదపాడు, పెదవేగి, ఏలూరు రూరల్ మండలాల్లోని 248 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న 2,637 మంది గర్భిణులు, బాలింతలు లబ్ధి పొందనున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై గర్భిణులు, బాలింతలు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహిళల ఆరోగ్యానికే తొలి ప్రాధాన్యత



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ, అభివృద్ధి, సంక్షేమానికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఏ ఒక్క గర్భిణీ, బాలింత ప్రభుత్వం అందించే పోషక పదార్థాల కోసం ప్రయాసపడి అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటికే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లుఅందించడం అభినందనీయం. ఈ నిర్ణయం ద్వారా వేలాది మంది బాలింతలు, గర్భిణులకు శాశ్వత ప్రయోజనం కలిగింది.

– కొఠారు అబ్బయ్యచౌదరి, ఎమ్మెల్యే, దెందులూరు

రుణపడి ఉంటాం



పౌష్టికాహారం కోసం అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా అందరి ఇబ్బందులు గుర్తించి ఈ నిర్ణయం తీసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. ఆయనకు రుణపడి ఉంటాం.

– కొత్తపల్లి కావేరి, బాలింత

బాలింతలు, గర్భిణులకు వరం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం బాలింతలు, గర్భిణులకు వరం. నాడు వైఎస్సార్, నేడు ఆయన కుమారుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారు. సంక్షేమ పథకాల అమలు వైఎస్ కుటుంబానికే చెల్లుతుంది. ఇంటికే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందించడం హర్షణీయం.

– లక్కపాముల పావని, గర్భిణీ

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



దెందులూరు: అంగన్‌వాడీ కేంద్రం-114లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న కనకదుర్గమ్మ ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి



పెదవేగి : రాట్నాలకుంటలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్‌లను పంపిణీ చేస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ విజయ్‌బాబు

దెందులూరు: తల్లిపాలతో చిన్నారుల ఆరోగ్యం, భద్రత, అభివృద్ధి ముడిపడి ఉందని విజయవాడ కనకదుర్గమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి అన్నారు. సోమవారం దెందులూరులో సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో తల్లిపాలు వారోత్సవాలు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను వేదకుమారి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీల యూనియన్ నాయకురాలు రంగనాయకమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు శైలజ, లక్ష్మి, కొత్తపల్లి లక్ష్మి, విజయలక్ష్మి, ఆయాలు, గర్భిణులు బాలింతలు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్‌ల అందజేత

పెదవేగి : ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకుని చక్కటి ఆరోగ్యం సొంతం చేసుకోవాలని జెడ్పీ వైస్‌చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన టీహెచ్‌ఆర్ పంపిణీ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు జగనన్న సంపూర్ణ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె మేరిబాయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదవేగిలో...

తల్లిపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యమని పెదవేగి ఎంపీపీ తాతా రమ్య అన్నారు. సోమవారం పెదవేగిలో 123 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ తాతా రమ్య మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యమని అన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు జగనన్న సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణవేణి, అనురాధ, మల్లిక మహిళా పోలీసు జ్యోతి పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యమని సోమవారం పెదవేగి మండలంలోని వంగూరులో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత రత్నం హాజరయ్యారు. గర్భిణులు ,బాలింతలకు జగనన్న సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిలి రూతు, ఎంపీటీసీ జి మరియమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు తలారి లావణ్య, సీహెచ్ అనురాధ, ఎన్ మల్లమ్మ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గద్దర్ మరణం తీరని లోటు



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ప్రజా యుద్ధనౌక గద్దర్ మరణం యావత్ ప్రజానీకానికి తీరని లోటని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అన్నారు. స్థానిక నరసింహారావుపేటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో సోమవారం గద్దర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ గద్దర్ ఎన్నో సామాజిక పోరాటాలు చేశారని, తెలంగాణ పోరాటంలో తనకంటూ ఒక ప్రత్యేకతను కల్పించుకుని కొన్ని వేల మంది కళాకారులను తయారు చేసిన గొప్ప సామాజిక సంఘసంస్కర్త అని కొనియాడారు. గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొనికెళ్ల రవిప్రసాద్, గారపాటి నాగేశ్వరరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పలు సంఘాల సంతాపం

ప్రజా గాయకుడు జననాట్యమండలి రాష్ట్ర నాయకుడు గద్దర్ మృతికి ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం వ్యక్తం చేశాయి. ఎన్నో ప్రజాసమస్యలపై కళారూపాలను రూపొందించి, పాటలు రచించి వాటిని ప్రదర్శించడం ద్వారా ప్రజలను చైతన్య పర్చడంలో గద్దర్ చూపించిన కృషి మువలేనిదని ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా కన్వీనర్ బళ్ల కనకదుర్గారావు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, నాయకులు తమ్మా విశ్వేశ్వరరావు, పల్లె వెంకట నారాయణ, గేదెల నాగేశ్వరరావు, తూతిక ధనుంజయ, పాటూరి నాగేశ్వరరావు, తదితరులు పేర్కొన్నారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

దెందులూరు : మండలంలో వార్డు మెంబర్ల ఎన్నికకు మంగళవారం నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని ఎన్నికల అధికారిణి, ఎంపీడీఓ ఏబీపీపీ లక్ష్మి తెలిపారు. దెందులూరు గ్రామంలో 4 వార్డు, కొత్తగూడెం గ్రామంలో 2, 5 వార్డులు, కొవ్వలి గ్రామంలో 11 వార్డు, గోపన్నపాలెంలో 11వ వార్డుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం నుంచి ఈనెల 10వ తేది వరకు నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని, 19 ఎన్నికలు ఉంటాయని ఎంపీడీవో తెలిపారు.

ఆరోగ్యశ్రీ ఆవిర్భావ దినోత్సవం

దెందులూరు : ఆరోగ్యశ్రీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గోపన్నపాలెం పీహెచ్‌సీలో సోమవారం రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తనగాల శేఖర్, జొన్నకూటి జాన్, మద్దాల తిరుపతిరావు, ఎర్రా రఘు, ఎర్రా ఆనంద్, వీరయ్య రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

నులి పురుగు నివారణతో ఆరోగ్యం



మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరాజు

ఏలూరు రూరల్: నులిపురుగు నివారణతో పిల్లలు, పెద్దలు మరింత ఆరోగ్యవంతంగా జీవించవచ్చని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. ఆగస్టు 10న వరల్డ్ డి వామింగ్ డేని పురస్కరించుకుని సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ కడుపులో నులిపురుగులు పెరగడం వల్ల పిల్లలు ఎదుగుదల మందగిస్తుందని చెప్పారు. పెద్దల ఆరోగ్యంపై సైతం ప్రభావం కనిపిస్తుందన్నారు. ఈ సమస్య నివారణకు ఏడాదికి ఒకసారైనా నులిపురుగు నివారణ మాత్రలు వేసుకోవాలని, ఇందు కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నులిపురుగు నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమం విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆగస్టు 10న అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులు, పాఠశాల పిల్లలు, కళాశాలలో చదువుకుంటున్న యువతకు నులిపురుగు నివారణ మాత్రలు అందించాలన్నారు. చాటపర్రు పీహెచ్‌సీ వైద్యురాలు చందన మాట్లాడుతూ ఒకటి నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు సగం మాత్ర కడుపులో వేయాలన్నారు. మాత్రలు వేసుకున్న పిల్లలను కొద్దిసేపు గమనించాలని సూచించారు. రెండు నుంచి 18 ఏళ్ల యువతీ యువకులకు రెండు మాత్రలు వేయాలన్నారు. అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారికి మాత్రలు ఇవ్వొదని సూచించారు. అనంతరం ఎంపీపీ చేతుల మీదగా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సెంటర్ టీచర్లు, వైద్య సిబ్బందికి మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ వై.సుజాత, గుడివాకలంక ఎంఈఓ ఆనంద్, ఎంఈఓ రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు రామశింగవరంలో గడపగడపకు మన ప్రభుత్వం

పెదవేగి : రామశింగవరంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పెదవేగి మండల సచివాలయ కన్వీనర్ కేశన సతీష్ తెలిపారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఈ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ పర్యటిస్తారన్నారు. ప్రభుత్వ పథకాల అమలు తీరును, ప్రజల సమస్యలను తెలుసుకుంటారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

28న ఏలూరులో ర్యాలీ

ఏలూరు (టూటౌన్): రాజ్యాంగబద్ధమైన ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 28న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఏలూరులో భారీ ర్యాలీ, అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు జేఏసీ అడహాక్ కమిటీ పేర్కొన్నారు. స్థానిక పెద్ద పోస్టాఫీస్ ఆవరణలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. పదోన్నతుల్లో రిజర్వేషన్లు కోసం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అడహాక్ జేఏసీని ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుగా దాసరి నాగేంద్ర, చైర్మన్‌గా చొప్పల సాయిబాబా, వైస్ చైర్మన్లుగా ఎ.సర్వేశ్వరరావు, జె.రవీంద్ర, జి.కృష్ణ, ఎం.మహంకాళి, కన్వీనర్‌గా జి.మధుసూదనరావు, కోకన్వీనర్లుగా కె.సత్యనారాయణ, ఎన్ అప్పారావు, ఎ.వీరయ్య, ఎన్.రవికుమార్, జి.స్వరూప్ దత్, పి.లక్ష్మణుడు, ఎ.సాయిరాజు, విద్యాసాగర్, కోశాధికారిగా జి.వెంకటేశ్వరరావులను ఎన్నుకున్నారు. సమావేశానికి రాష్ట్ర గౌరవ సలహాదారుడు బేతాళ సుదర్శనం హాజరయ్యారు.

గుండుగొలను ఆలయాభివృద్ధికి సహకరించాలని వినతి



తిరుమలలో చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న వగ్వాల అచ్యుతరామారావు దంపతులు

భీమడోలు: తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని సోమవారం గుండుగొలను శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు, వైసీపీ నేత వగ్వాల అచ్యుతరామారావు దంపతులు తిరుమలలో మర్యాదపూర్వకంగా కలిసారు. గుండుగొలను ఆలయాభివృద్ధికి టీటీడీ దేవస్థానం నిధులు మంజూరు చేయడంతో ఆలయాన్ని పునర్నిర్మించిన విషయం అందరికీ విదితమే. ఆలయంలో మౌలిక వసతుల కల్పనకు, ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరినట్టు వారు సోమవారం తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానాన్ని అభివృద్ధి చేసిన వైవీ సుబ్బారెడ్డిని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించామన్నారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆలయానికి నిధులు మంజూరుకు ప్రత్యేక కృషి చేసారన్నారు. నిధులు మంజూరు చేసి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు సుబ్బారెడ్డి సహకరించారన్నారు.

ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోండి



దెందులూరులో 93 పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓట్ల సర్వే చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ బాలాజీ

దెందులూరు : గ్రామగ్రామాన ప్రభుత్వం నిర్వహిస్తున్న ఓటు హక్కు పరిశీలనకు ప్రజలందరూ సహకరించాలని ఓటు హక్కులేని వారు దరఖాస్తు చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల నాయకులు గోరిపర్తి శ్రీనివాసయాదవ్ అన్నారు. సోమవారం ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శేఖర్ ఇంటింటా బీఎల్‌ఓలు, ఉద్యోగులు చేస్తున్న ఓటుహక్కు పరిశీలన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాస యాదవ్ మాట్లాడుతూ సాంకేతిక లోపం, ఇతర కారణాల వల్ల కొందరు ఓటు హక్కు కోల్పోయిన సంగతి గత ఎన్నికల్లో చూశామని, ఈసారి అలా జరగకుండా ఉద్యోగులే ఇంటికి వస్తున్న నేపథ్యంలో ఓటు హక్కు లేనివారు, చిరునామాలో పొరపాటు ఉన్నవారు సిబ్బందికి తెలియచేయాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామగ్రామాన ఓటు హక్కు పరిశీలన కార్యక్రమంపై విస్తృతంగా ప్రజలకు తెలియచేయాలని సూచించారు.

సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్

భీమడోలు: పోలసానిపల్లి గ్రామ పంచాయతీలో ఖాళీగా ఉన్న 12వ వార్డు సభ్యుని ఎన్నికకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిందని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలో 12వ వార్డు సభ్యుడు జల్లా బాలకృష్ణ(బాలు) అనారోగ్యకారణం వల్ల గతేడాది డిసెంబర్‌లో మృతి చెందిన నేపథ్యంలో ఉపసర్పంచ్‌గా ఉన్న ఆ వార్డు సభ్యుని ఎన్నిక అనివార్యమయ్యిందన్నారు.

ఉంగుటూరు మండలంలో 3 వార్డులకు ఎన్నికలు

ఉంగుటూరు: మండలంలోని కాకర్లమూడి2 వార్డులకు, ఉంగుటూరు 1 వార్డుకి ఎన్నికల షెడ్యూలు విడుదలైందని ఎంపీడీవో ఆంజనేయులు తెలిపారు. కాకర్లమూడిలో కూన మణి వార్డు మెంబరుగా పని చేస్తుండగా ఎంపీటీసీ పోటీ చేసి గెలుపొందడంతో వార్డు మెంబరుకు రాజీనామా చేశారు. దాంతో ఆ వార్డు ఖాళీ అయ్యింది. తోట తులసీ రత్నం డిగ్రీ చదువుతూ పోటీ చేసి గెలిచారు. అనంతరం ఆ యువతి వివాహ నిమిత్తం రాజీనామా చేయడంతో ఆ వార్డు ఖాళీ అయ్యింది. దాంతో ఆ వార్డుకు ఎన్నిక అనివార్యం అయ్యింది. ఉంగుటూరులో కాళ్ల గౌరీలక్ష్మి చనిపోవడంతో ఖాళీ అవడంతో ఆ వార్డుకు ఎన్నిక అనివార్యమైందని ఎంపీడీవో తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీల్లో 8 నుంచి 10వతేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. 11న నామినేషన్ల పరిశీలన, 12, 13 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ, 14న నామినేషన్ల ఉపసంహరణ, 19న ఉదయం 7గంటల నుంచి ఒంటి గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు, అనంతరం ఫలితాలను ప్రకటిస్తామని ఎంపీడీవో వివరించారు.

వీరమ్మకుంట సర్పంచ్ ఉప ఎన్నిక షెడ్యూల్ విడుదల

పెదపాడు : మండలంలోని వీరమ్మకుంట సర్పంచ్ ఉప ఎన్నికతోపాటు పెదపాడులో 8వ వార్డు, అప్పనవీడు 7వ వార్డు, వసంతవాడలో 9వ వార్డు, పాత ముప్పర్రులో 10వవార్డు, రాజుపేటలో 1, 4 వార్డు మెంబర్లకు ఈనెల 19న ఉప ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. ఈనెల 8 నుంచి 10వ తేదీవరకు నామినేషన్ల స్వీకరణ, 11న పరిశీలన, 12న అభ్యంతరాల స్వీకరణ, 13న అభ్యంతరాల పరిష్కారం, 14న నామినేషన్ల ఉపసంహరణ, అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు తుది జాబితా విడుదల చేస్తారని చెప్పారు. 19న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అనంతరం రెండు గంటల నుంచి ఓట్లు లెక్కింపు చేసి ఫలితాలు విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

వేగంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు



వన్‌టౌన్ అరుంధతి పేటలో డ్రైయిన్



ఫిల్టర్ ట్యాంకు నిర్మాణ పనులు

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. దశాబ్దాలుగా వన్‌టౌన్ ప్రాంతంలో ప్రజలు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం వస్తే చాలు రోడ్లు మురుగునీటితో నిండిపోవటం, ఇంటి పరసరాల్లోనూ వర్షపు నీరు నిలిచిపోయేది. పాలకులు మారినా వారి కష్టాలు అలాగే మిలిగిపోయాయి. ఎమ్మెల్యే ఆళ్ల నాని ప్రత్యేక దృష్టి సారించి రూ.1 కోటితో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. అరుంధతీపేట, వైఎంహెచ్‌ఏ హాలు, రామకోటి, గంగానమ్మ గుడి ప్రాంతం, వెంకన్న చెరువు ప్రాంతాల్లో ప్రస్తుతం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయి. సుమారుగా 15 అడుగులు లోతులో డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేసి, డ్రైయిన్ శుభ్రం చేసేందుకు వాటికి అనుసంధానంగా మ్యాన్‌హోల్ నిర్మాణం, మురుగునీటిని ఫిల్టర్ చేసేందుకు ప్రత్యేకంగా ట్యాంకులను నిర్మిస్తున్నారు. కార్పొరేటర్ జిజ్జువరపు విజయనిర్మల, జిజ్జువరపు రమేష్ పనులను పర్యవేక్షిస్తున్నారు.

పక్కాగా భూముల రీ సర్వే

ఏలూరు రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూమల రీ సర్వే పక్కాగా కొనసాగుతోందని తహసీల్దార్ బి.సోమశేఖర్ అన్నారు. సోమవారం స్పందన కార్యక్రమంలో ఆయనకు కోమటిలంకకు చెందిన ఓ కుటుంబ సభ్యులు కుటుంబ వివాదం కొనసాగుతున్నందున రీసర్వే నిలుపుదల చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. పలువురు మహిళలు ఇంటి స్థల, రేషన్‌కార్డు కోసం దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములతో పాటు ప్రైవేటు భూములన్నీ నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాల్సుందన్నారు. వ్యక్తిగత, కుటుంబ తగాదాల కారణంగా రీసర్వే నిలుపుదల చేయడం సాధ్యం కాదని, పెద్దల సమక్షంలో సమస్య పరిష్కరించుకోవాలని, లేనిపక్షంలో కోర్టు ద్వారా న్యాయం పొందాలని సూచించారు. గ్రామాల్లో భూముల రీసర్వే భూమి హక్కుదారులకు భవిషత్తులో వివాదాలు లేకుండా పక్కా రికార్డులు, సరిహద్దులు నిర్ణయించేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఈడీపీఆర్డీ ఎం సరళకుమారి పాల్గొన్నారు.